# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 21 ఏప్రిల్ 2025 | పేజీలు 8


## సుల్తాన్ బజార్‌లో భారీగా హవాలా డబ్బు పట్టివేత



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో మరోసారి హవాలా డబ్బు కలకలం రేపింది. ఆదివారం (ఏప్రిల్ 20) సాయంత్రం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ టెక్డీ దగ్గర పోలీసులు వెహికల్స్ చెక్ చేస్తుండగా హవాలా డబ్బు పట్టుబడింది. బైక్ పై వెళు_న్న ఇద్దరు వ్యక్తుల దగ్గర భారీగా నగదు చేసుకున్నారు సుల్తాన్ బజార్ పోలీసులు. బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానం వచ్చి తనఖీ చేయగా.. వారిదగ్గర భారీగా నగదు దొరికింది. బ్లాక్ కవర్ లో దాచి రూ. 4.50వేల నగదును తరలిస్తుండగా సీజ్ చేశారు. ఆ నగదును ఇన్ కమ్ ట్యాక్స్ శాఖ అధికారులకు అప్పజెప్పారు సుల్తాన్ బజార్ పోలీసులు. వారినుంచి రెండు బైక్ లు , మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## తెలంగాణ ప్రజలకు
# భారాసయే అండ




**హైదరాబాద్ పెన్ పవర్:** భాజపా, కాంగ్రెస్ కలిసి భారాసను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయని, అయితే తెలంగాణ ప్రజలకు అండగా ఉండేది భారాస మాత్రమే అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రస్తుత తెలంగాణలో, అంతకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో పార్టీలు పుట్టాయని, ఎన్నో పోయాయని.. తెలుగుదేశం, భారాస మాత్రమే విజయవంతంగా నిలదొక్కుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన సమక్షంలో నగరంలోని అత్తాపూర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత శ్రీరామ్‌రెడ్డి, అనుచరులు భారాసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. క్రైస్తవులకు ఈస్టర్... తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు పుట్టినరోజు

-2 లో

## సర్వే నాటికి సాగులో ఉన్న భూములకు
# అటవీ హక్కు పట్టాలు

**ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభలో మంత్రి సీతక్క**

**ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించి నినాదాలు**



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో గతంలో ఏజెన్సీ పోడు భూముల సర్వే నిర్వహించిన సమయానికి సాగులో ఉన్నవాటికి అటవీ హక్కు పట్టాలిస్తామని, సర్వే జరగని భూములకు రీ-సర్వే చేయిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. దశాబ్దాలుగా ఆదివాసీ గిరిజనుల సాగులో ఉన్న భూముల్లోకి అటవీ సిబ్బంది వెళ్లి మొక్కలు నాటుతామనటం అన్యాయమన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరుల స్తూపం వేదికగా 44 ఏళ్ల తర్వాత ఆదివారం అధికారికంగా నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1980 ఏప్రిల్ 20న స్తూపం వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో మరణించిన ఆదివాసీ అమరులకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లతో కలిసి నివాళులర్పించారు. అనంతరం వెడ్మ బొజ్జు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో 15 కంటే ఎక్కువ మంది చనిపోయారంటున్నారని, ఐటీడీఏ పీవో నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి..బాధిత కుటుంబాలను గుర్తిస్తామని సీతక్క భరోసా

-2 లో

## ఆత్మనిర్భర్ భారత్‌లో
# ఐసీఎస్ఐ పాత్ర కీలకం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆత్మనిర్భర్ భారత్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) పాత్ర కీలకమని, దేశాభివృద్ధిలో సీఎస్‌లు ముఖ్యభూమిక పోషించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పంజాగుట్ట ఆనందనగర్‌లో ఐసీఎస్ఐ చాప్టర్-3 భవన నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ చేరేందుకు ఐసీఎస్ఐ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న 75 వేల మంది నుంచి 1.50 లక్షల మంది కంపెనీ సెక్రటరీలను తయారు చేసే విధంగా సంస్థ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ అధ్యక్షుడు ధనుంజయ శుక్లా, ఉపాధ్యక్షుడు పవన్ జి చందక్, మనీశ్‌గుప్తా, నరసింహన్, ఎన్‌బీసీసీ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ఎన్.జనార్దన్‌రావు, సీఎస్‌లు రాజవోలు వెంకటరమణ, ఆశిష్ మోహన్, మధుసూదన్, మంజిత్ బుచ్చా తదితరులు పాల్గొన్నారు.

**భాజపా ఎంపీ**
**కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# ఆత్మప్రబోధానుసారం ఓటేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** 'మజ్లిస్ పార్టీతో భారాస, కాంగ్రెస్‌లు కుమ్మక్కై ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయి. ఇది రాజ్యాంగ విరుద్ధం. దీన్ని దృష్టిలో ఉంచుకుని దేశభక్తితో ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలి' అని చేవెళ్ల ఎంపీ, భాజపా నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కార్పొరేటర్లకు సూచించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ ఎన్నికలు జాతీయ పార్టీకి, కుటుంబ పార్టీలకు మధ్య జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీపై అసదుద్దీన్ ఒవైసీ విమర్శలు దౌర్భాగ్యకరమని వ్యాఖ్యానించారు. వక్ఫ్ సవరణ చట్టంపై మజ్లిస్, కాంగ్రెస్, భారాస పార్టీలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నాయని భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతంరావు ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని గౌరవించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## బీజేపీ.. బీఆర్ఎస్ లను ఎవరూ నమ్మరు: సీపీఐ నేత కూనంనేని



హైదరాబాద్ పెన్ పవర్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కరీంనగర్? లో పర్యటించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలను ఎవరు నమ్మరని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దుర్మార్గమైన పాలన కొనసాగిస్తోందన్నారు. కేంద్రం తాత్కాలిక ఉపయోగాల కోసమే చేస్తుందని దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమం ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవన్న కూనం నేని సీపీఐ ప్రజా సమస్యలపై పోరాడుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు గాలిలో మేడలు కడుతున్నారని.. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందని కాషాయ నేతలు ఓట్లు అడుగుతున్నారని.. కేంద్ర నుంచి తెలంగాణకు రావలసిన నిధుల్లోఅన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించిన బీజేపీ ప్రభుత్వం.. తెలంగాణకు మాత్రం 2.4 శాతమే ఇస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా.. ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం పాలన ఉందని దుయ్యబట్టారు.

## సమ్మర్ హాలిడేస్‌కు అమ్మమ్మ వాళ్ల ఊళ్లో.. ఇంటి ముందు ఆడుకుంటున్న 2 ఏళ్ల పిల్లాడికి ఇలాంటి చావా..?

హైదరాబాద్ పెన్ పవర్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గంగనగర్?లో విషాద ఘటన జరిగింది. కారు కింద పడి శివరాజ్ కుమార్ అనే 2 సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. ఆడుకునేందుకు రోడ్డు పైకి వచ్చిన బాలుడిని కారు ఢీ కొట్టింది. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన బాలుడు శివరాజ్ కుమార్ ఇలా చనిపోవడంతో బాలుడి తల్లి కన్నీరుమున్నీరైంది. ఆమె రోదిస్తున్న దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని కారుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి విషాద ఘటనలతో పాటు నేరాలుఘోరాలు కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో దారుణం జరిగింది. మానసిక ఆరోగ్య సమస్య కారణంగా కూతురుకి విషమిచ్చి తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.కన్న కూతురు జశ్విక(4)కి ఎలుకల మందు కూల్ డ్రింక్?లో కలిపి ఇచ్చి కన్న తల్లి క్రిష్ణపావని (32) చంపేసింది. అనంతరం క్రిష్ణపావని (32) కూడా విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆత్మహత్య చేసుకునేందుకు ఎలుకల మందును కృష్ణ పావని ఆన్?లైన్?లో ఆర్డర్ చేసింది. 18వ తేదీ సాయంత్రం ఎలకల మందును కలిపి కూతురికిచ్చి తను తాగింది. 19వ తేదీ తెల్లవారుజామున ఇద్దరి పరిస్థితిని గమనించి భర్త, స్థానికులు ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు.నాలుగేళ్ళ చిన్నారి జశ్విక చికిత్స పొందుతూ సాయంత్రానికి చనిపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి కృష్ణ పావని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. కృష్ణ పావనికి అనారోగ్య సమస్యల కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భర్త సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణ పావని కూతురు జశ్వికకు గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# తెలంగాణ ప్రజలకు భారాసయే అండ

- మొదటి పేజీ తరువాయి

శుభాకాంక్షలు చెప్పారు. 'నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఐటీ రంగాన్ని చంద్రబాబునాయుడు అభివృద్ధి చేశారు. మంచి చేస్తే ఒప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, డిక్లరేషన్ల పేరిట ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చింది. హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూలుస్తున్నారు. రాజేంద్రనగర్‌లో నాకు భూములు ఉన్నాయంటున్న కాంగ్రెస్ నేతలు.. ఎక్కడున్నాయో చూపించాలి.

**ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ చర్యలేవీ?**

మత, కుల విద్వేషాలు రెచ్చగొట్టడమే భాజపా నైజం. హిందువులు ప్రమాదంలో ఉన్నారని ఆ పార్టీ నేతలంటున్నారు. అదే నిజమైతే మోదీ విఫలమైనట్లే కదా. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్ వసూల్ చేస్తోందన్న మోదీ.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అమృత్ టెండర్లు రేవంత్‌రెడ్డి బావమరిదికి కట్టబెడితే కేంద్రం నుంచి చర్యలే లేవు' అని కేటీఆర్ విమర్శించారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే భారాస రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, భారాస రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కార్తీక్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

**భారాస రజతోత్సవ గీతం సీడీ ఆవిష్కరణ**

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు గతంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన భారాస రజతోత్సవ గీతం 'సమర శంఖ గర్జన.. గెరిల్లా ఉద్యమాల ఖిల్లా ఓరుగల్లు జిల్లా' సీడీని ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. దీన్ని గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, పార్టీ రాష్ట్ర నేత జోరిక రమేశ్ ఆధ్వర్యంలో రూపొందించారు. ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లోని ఆశయాలను ఈ గీతం ప్రతిబింబించిందని కేటీఆర్ అన్నారు. గాయని జెర్రిపోతుల సంధ్యను అభినందించారు.

# సర్వే నాటికి సాగులో ఉన్న భూములకు అటవీ హక్కు పట్టాలు

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చారు. ఉట్నూర్, ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి రూ.15 కోట్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో అమరులైనవారి కుటుంబాలకు కొక్కిరాల రఘుపతిరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఏడాదికి రూ.20 వేల చొప్పున జీవిత కాలంపాటు ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రేమ్‌సాగర్‌రావు ప్రకటించారు. సభలో కేంద్ర మాజీ మంత్రి వేణు గోపాలాచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్‌కుమార్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదివాసీ నేతలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఇంద్రవెల్లి కాల్పుల్లో మరణించిన నలుగురి కుటుంబాలకు మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని అందజేశారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.1.59 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం గిరిజన యువతకు ఏర్పాటు చేసిన వాహన డ్రైవింగ్ శిక్షణను మంత్రి ప్రారంభించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 14 వేల అంగన్‌వాడీ ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

**అడవి బిడ్డల పోరాటం స్ఫూర్తిదాయకం**

జల్.. జంగల్.. జమీన్ అంటూ హక్కుల కోసం అసువులు బాసిన అడవి బిడ్డల పోరాటం సదా స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా కొనియాడారు. ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా సీఎం వారికి ఘనంగా నివాళులర్పించారు.

## పటాన్? చెరువులో విషాదం: బస్సు ఎక్కుతూ జారిపడిన ప్రయాణికుడు.. చికిత్సపొందుతూ మృతి..




హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ పటాన్ చెరువు బస్టాండ్?లో విషాద ఘటన జరిగింది. బస్సు ఎక్కుతూ జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు.. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. పటాన్ చెరువు బస్టాండ్‌లో జాన్ మహమ్మద్ అనే వ్యక్తి బస్సు ఎక్కుతూ కాలు జారి బస్సు వెనుక చక్రం కిందపడ్డాడు. మెదక్ డిపోకు చెందిన బస్సు
కిందపడ్డాడు. తీవ్రగాయాలుకావడంతో.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ప్రయాణికుడు జాన్ మహమ్మద్ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పటాన్ చెరువు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పటాన్ చెరువులో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు.

# క్రికెట్ ఆడుతుండగా కుప్పకూలిన కెనరా బ్యాంక్ ఉద్యోగి.. హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే ప్రాణం పోయింది..





**హైదరాబాద్ పెన్ పవర్:** కీసర రాంపల్లి దయారా త్యాగి క్రికెట్ గ్రౌండ్?లో క్రికెట్ ఆడుతూ ప్రణీత్ అనే వ్యక్తి ఊపిరి ఆడక కింద పడిపోయాడు. పక్కనే ఉన్న తోటి వారు అంబులెన్స్?లో చిర్యాల్ ఎక్స్ రోడ్డులో ఉన్న విజయ్ ట్రామా హాస్పిటల్?కి తరలించారు. అప్పటికే ప్రణీత్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. గుండె పోటు అయి ఉండొచ్చని వైద్యులు భావిస్తున్నారు. బోయిన్ పల్లిలో నివాసం ఉంటున్న ప్రణీత్ కెనరా బ్యాంక్ ఉద్యోగి అని తెలిసింది. ఆదివారం ఉదయం ప్రణీత్ ఫ్రెండ్స్?తో కలిసి క్రికెట్ ఆడడానికి త్యాగి క్రికెక్ గ్రౌండ్?కి వెళ్లాడు. క్రికెట్ ఆడుతుండగానే దురదృష్టవశాత్తూ ఇలా జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. గుండె జబ్బు అనేది కరోనరీ ఆర్టరీ వ్యాధి. కార్డియాక్ అరెస్ట్, గుండెపోటులు జీవన శైలిలో మార్పులు, వైద్యపరమైన చికిత్సలతో నివారించవచ్చు. గుండెపోటు రాగానే చాలా మందికి ఆందోళనకు గురవుతారు. దాని వల్ల కొన్నిసార్లు వారి గుండె ఆగిపోవడం కూడా జరుగుతుంది. కార్డియాక్ అరెస్ట్, గుండెపోటు.. ఈ రెండు గుండెకు సంబంధించిన తీవ్రమైన వ్యాధులు. వీటిని ప్రారంభంలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు.

# ఐపీఎల్ టికెట్లు కావాలా.. అయితే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. సైబర్ నేరగాళ్ల నయా దోపిడీ



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా ఐపీఎల్ సందడి కొనసాగుతోంది. తమ అభిమాన ప్లేయర్ ఆటకోసం.. అభిమాన టీమ్ కోసం ఫ్యాన్స్ ఎంత ఖర్చు చేసేందుకైనా వెనకాడటం లేదు. దేశ వ్యాప్తంగా ఎక్కడ మ్యాచ్ జరుగుతున్నా చూసేందుకు ముందుగానే టికెట్ బుక్ చేసుకుంటున్నారు. దొరకని పక్షంలో బ్లాక్ కొనేందుకు సిద్ధమవుతున్నారు. అయితే క్రికెట్ అభిమానుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నిట్ట నిలువునా దోచుకుంటున్నారు. ఆన్?లైన్?లో ఐపీఎల్ టికెట్లు డిస్కౌంట్ కే ఇస్తున్నామంటూ మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం ఏప్రిల్ 23న సన్ రైజర్స్ వర్సెస్ ముంబై మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే హాట్ కేకుల్లా టికెట్లు అమ్ముడుపోయాయి. ఆన్?లైన్?లో టికెట్ సేల్స్ పెట్టిన గంటలోపే సోల్డ్ అవుట్ అయిపోయాయి. చాలామంది అభిమానులు టికెట్లు దొరకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇదే అదునుగా చేసుకున్న సైబర్ ఫ్రాడ్?స్టర్లు అభిమానుల ఆశను దోచుకునే పనిలో పడ్డారు. సోషల్ మీడియాలో ఐపిఎల్ టికెట్ల విక్రయం పేరుతో కొన్ని ప్రత్యేక పేజీలను ఏర్పాటు చేశారు. ఈ పేజీల ద్వారా టికెట్లు కావాలంటే సంప్రదించాల్సిందిగా కొన్ని వాట్సాప్ నెంబర్లను సైతం అందులో ప్రచురించారు. ఇది నిజమేమో అనుకుని నమ్మిన అభిమానులు ఆ వాట్సాప్ నంబర్ తో చాట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రూ.3,500 ఉన్న ఐపిఎల్ టికెట్ కు డిస్కౌంట్ కూడా ఇస్తామని అభిమానులను నమ్మిస్తున్నారు. రెండు టికెట్లు అయితే డిస్కౌంట్ ఎక్కువగా ఉంటుందని, కావాలంటే క్యూఆర్ కోడ్ కి డబ్బులు చెల్లించాల్సిందిగా నమ్మిస్తున్నారు. క్రికెట్ మీద ఆశతో నిజంగానే టికెట్లు వస్తాయేమో అని ఆశపడుతున్న అభిమానులకు చివరిగా నిరాశ మిగులుతోంది. క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు స్కాన్ చేసి ఆ స్క్రీన్ షాట్ ను సంబంధిత వాట్సాప్ నెంబర్ కు పంపిన తర్వాత ఆ నంబర్ నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయామని బాధితులు గ్రహిస్తున్నారు. ఈ తరహా ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. హైదరాబాద్, బెంగళూరు, కోల్కత్తా, ముంబై, చెన్నై లాంటి జట్లు ఆడే మ్యాచ్ లకు ఫ్యాన్స్ క్రేజీ విపరీతంగా ఉన్నతరణంలో ఆన్?లైన్?లో టికెట్లు దొరకడం కష్టంగా మారింది. టికెట్లను కేవలం డిస్ట్రిక్ట్ బై జొమాటో, బుక్ మై షో యాప్ లో మాత్రమే కొనుక్కోవాల్సిందిగా అభిమానులకు పోలీసుల సూచిస్తున్నారు. సోషల్ మీడియా ప్రకటనలు చూసి మోసపోవద్దు అంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ ఎవరైనా అలాంటి ప్రకటనలు చూస్తే వెంటనే తమకు సమాచారం అందించాల్సిందిగా కోరుతున్నారు.

## అయ్యో.. ఎందుకమ్మా ఇలా చేశావ్: హైదరాబాద్ ప్రగతి నగర్ లో కూతురికి విషం ఇచ్చి.. తల్లి ఆత్మహత్య




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ఇద్దరు కొడుకులను నరికి చంపి.. తల్లి ఆత్మహత్యకు పాల్పడ్డ హృదయ విదారక ఘటన మరవకముందే.. అలాంటిదే మరో ఘటన చోటు చేసుకుంది.. కూతురికి విషం ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడింది ఓ తల్లి. హైదరాబాద్ లోని ప్రగతి నగర్ లో చోటు చేసుకుంది ఈ ఘటన. ఆదివారం ( ఏప్రిల్ 20 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ లో నాలుగేళ్ళ కూతురికి విషం ఇచ్చి.. తానూ కూడా తీసుకొని ఆత్మహత్యకు పాల్పడింది ఓ తల్లి. ఈ ఘటనలో కూతురు మృతి చెందగా.. తల్లి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కూకట్ పల్లిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో తల్లికి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య సమస్యలతోనే ఆత్మహత్యకు కారణమని తెలిపారు బాచుపల్లి పోలీసులు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సీలంపూర్ హత్య కేసు: లేడీడాన్ జిక్రాతో సహాపడుగురు అరెస్ట్.. నిందితుల్లో మైనర్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీలోని సీలంపూర్ దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితురాలు జిక్రా అలియాస్ లేడీ డాన్ సహా ఏడుగురుని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. 17యేళ్ల కునాల్ అనే మైనర్ ను హత్య చేసిన కేసుతో సంబంధం ఉన్న అరెస్టులతోపాటు మరికొంతమంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. జిక్రా అలియాస్ లేడీ డాన్..10మంది మైనర్ల ముఠాను ఏర్పాటు చేసి వారితో ఆ ప్రాంతంలో భయాందోళనలు సృష్టించేది. ఆమె ఈ మైనర్ల ముఠాతో కలిసి పిస్టల్ వంటి ఆయుధాలు పట్టుకొని ఆ ప్రాంతంలో హల్ చల్ చేసేదని తెలుస్తోంది. కునాల్ హత్యకు ప్రణాళిక, అమలులో మైనర్ల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**కునాల్ హత్య కు కారణం..**

పోలీసు కస్టడీలో ఉన్న జిక్రా కునాల్ హత్య కేసులో కీలక విషయాలు బయటపెట్టింది. గత నవంబర్ లో కునాల్ అతని స్నేహితులు లాలా, శంభులు ఆమె బంధువులపై దాడి చేశారు. ఈ సంఘటన జరిగినప్పుడు కునాల్ అక్కడే ఉన్నా మైనర్ కావడంతో పోలీసులు అరెస్ట్ చేయలేదు. అయితే జిక్రా బంధువులపై దాడిలో కునాల్ కూడా ఉన్నాడని అనుమానించి, మైనర్లతో నిఘా పెట్టింది.

అతను ఆస్పత్రికి వెళ్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు దాడి చేసి కునాల్ ను కత్తులతో పొడిచారు.. ఘటన జరిగినప్పుడు జిక్రా సమీపంలోనే ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం: సూర్యాపేట జిల్లాలో బస్సు బోల్తా.. 30 మందికి తీవ్రగాయాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. చింతపాలెం మండలంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 20 నుంచి 30 మందికి గాయాలయ్యాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే...కోదాడ డిపో కు చెందిన బస్సు కోదాడ నుంచి చింత్రియాలకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బైక్? ను తప్పించబోయి బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 20 నుఏంచి 30 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మేళ్లచెరువు, హుజూర్? నగర్ ఏరియా హాస్పటలకు 108 ద్వారా తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 నుంచి 60 ప్రయాణికులు ఉన్నారు. ఇంకా దీనికి సండంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. . .

# బాబు ఫస్ట్ పొలిటికల్ పుట్టిన రోజు.. అతిథి తెలిస్తే ఆశ్చర్యం!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ అధినేత చంద్రబాబు 75వ పుట్టిన రోజు. రాష్ట్ర వ్యాప్తంగా తమ్ముళ్లు అత్యంత ఘనంగా నిర్వహి స్తున్నారు. అసలు వస్తుందా రాదా.. అన్నట్లుగా ఉన్న పార్టీని 2024లో అధికారంలోకి తీసుకువచ్చారు. భవిష్యత్తుపైనా పట్టు బిగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ పుట్టిన రోజుకు అంత ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలావుంటే.. అసలు చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత.. ఫస్ట్ పుట్టిన రోజు ఎక్కడ నిర్వహించు కున్నారో తెలిస్తే.. ఆశ్చర్యం వేస్తుంది.సుమారు 1980లలో చంద్రబాబు రాజకీయ ప్రవేశం చేశారు. ఆ సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వాస్తవానికి చంద్రబాబు పుట్టిన రోజు చేసుకోవాలని కానీ.. పుట్టిన రోజు గురించి కానీ.. ఆయన ఆలోచించడమే లేదు. ఇలాంటి సమయంలో అనూహ్యంగా చంద్రబాబు విషయాన్ని అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టించుకున్నారు. ఇద్దరూ మిత్రులే కావడంతో.. చంద్రబాబు పుట్టిన రోజును ఘనంగా చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉండగా.. చంద్రబాబు రాష్ట్రంలో మంత్రిగా ఉన్నారు. దీంతో చంద్రబాబు సీమ వాడని.. ఆయన పుట్టిన రోజును ఘనంగా చేయడం ద్వారా.. సీమలో కాంగ్రెస్‌పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్న వైఎస్ రాజశేఖర రెడ్డి.. రాజకీయంగా తొలి పుట్టిన రోజును 1982, ఏప్రిల్‌లో చిత్తూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పటి సీఎం కూడా పాల్గొన్నారు. ఇలా.. చంద్రబాబు రాజకీయ జీవితంలో తొలి పుట్టిన రోజును వైఎస్ నిర్వహించడం.. గమనార్హం.

# బంగారం ఆల్ టైమ్ రికార్డు.. 4నెలల్లో 25 శాతం పెరిగిన గోల్డ్ రేట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**2025లోగోల్డ్ రేట్ భారీగా పెరిగాయి. గడిచిన నాలుగు నెలల్లో దాదాపు 25 శాతం పెరిగి MCX, COMEX రెండింటిలోనూ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. COMEX లో వెండి ధర కూడా 15 శాతం పెరిగింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, అమెరికా, చైనా వాణిజ్య ఉద్రిక్తతల మధ్య సంస్థాగత, రిటైల్ ఇన్వెస్టర్లు బంగారం సురక్షితం అని భావించడం కారణంగా ఈ పదునైన ర్యాలీ జరిగిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ ) తెలిపింది. బంగార ధరలు ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేస్తున్నారు. ట్రేడ్ వార్, ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకు బంగారం కొనుగోళ్లు వంటి పరిణామాలు ధరల పెరుగుదలకు మద్దతునిస్తూనే ఉంటాయని భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో MCX లో 10 గ్రాముల బంగారం 91వేలు, 24క్యారెట్స్ 10 గ్రాముల బంగారం ధర 99వేలుగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి,వృద్ధి మందగమనంలో ఉండటంతో బంగారాన్ని తరగని ఆస్తిగా



భావిస్తున్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రస్తుత అస్థిరమైన భౌగోళిక రాజకీయాలు, ఆధిపత్య ధోరణలు కొనసాగుతున్న క్రమంలో బంగారంపై ఇన్వెస్ట్ చేయడం మంచిదని మదపర్లు భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర బ్యాంకులు నిల్వలను పెంచుకోవడం, ఇన్వెస్టర్లు సేఫ్టీ కోరుకోవడం బంగారం అనుకూలమైన ఆస్తిగా నమ్ముతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా వస్తువులపై సుంకాలను పెంచడంతో బంగారం ధరల్లో కుదుపు వచ్చింది. అయితే కానీ త్వరగా కోలుకోవడం ఇన్వెస్టర్లు విశ్వాసాన్ని పెంచింది. ట్రంప్ పరిపాలన దూకుడు ట్రేడింగ్ విధానం అమెరికాకు ఉన్న డజన్ల కొద్దీ బిజినెస్ పార్టినర్లను దూరం చేసింది. ముఖ్యంగా చైనాపై 245 శాతం వరకు అధిక సుంకాలు విధించడంతో బీజింగ్ ప్రతీకార చర్యలు చేపట్టింది. దీని వలన అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే అవకాశం ఉందని, ఆర్థిక మాంద్రం ఏర్పడే అవకాశం ఉందని మార్కెట్ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

# తెలుగువారి అదృష్టం చంద్రబాబు.. సెలబ్రిటీల పొగడ్తలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి చంద్రబాబు డైమండ్ జూబ్లీ బర్త్ డే విషెస్ తో సోషల్ మీడియా హొరెత్తిపోతోంది. ఎక్స్, ఫేస్ బుక్, ఇన్ స్టా.. ఒకటేంటి అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫాంల్లోనూ చంద్రబాబు ఫొటోలు, పుట్టినరోజు వేడుకలు, శుభాకాంక్షలు ట్రెండింగ్ అవుతున్నాయి. పలువురు రాజకీయ నాయకులు, సినీ, క్రీడా ప్రముఖులు ముఖ్యమంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో తాము కలిసివున్న ఫొటోలను షేర్ చేస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మెగాస్టార్ చిరంజీవి గతంలో చంద్రబాబుతో తాను దిగిన ఓ అపురూప చిత్రాన్ని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. దూరదృష్టి కలిగిన నాయకుడు దొరకడం తెలుగు ప్రజల అదృష్టం అంటూ చంద్రబాబు సేవలను కొనియాడారు చిరంజీవి. "జన్మదిన శుభాకాంక్షలు చంద్రబాబు గారు. దార్శనికత, కృషి, పట్టుదల, అంకిత భావం ఉన్న అరుదైన నాయకులు మీరు. ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలతో పాటు ప్రజల కోసం మీరు కనే కలలు నెరవేర్చే శక్తిని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీకు 75వ జన్మదిన శుభాకాంక్షలు" అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు.నా మిత్రుడు, నా



శ్రేయోభిలాషి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి పుట్టినరోజు సందర్భంగాశుభాకాంక్షలు. వంద సంవత్సరాలు అష్టైశ్వర్య, ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని మనసా వాచా కోరుకుంటున్నాను అంటూ సీనియర్ నటుడు, మాజీ రాజ్యసభ సభ్యులు మోహన్ బాబు ట్వీట్ చేశారు. అదేవిధంగా సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు ప్రత్యేక వీడియో తయారు చేయించి విజనరీ, మార్గదర్శ, పీ4 సృష్టికర్త చంద్రబాబు అంటూ ట్వీట్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ని స్వర్ణాంధ్ర ప్రదేశ్ దిశగా నడిపిస్తూ సర్వతోముఖాభివృద్ధి కోసం ఎంతో గొప్ప విజనరీ, నిరంతరం శ్రమిస్తున్న శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారికి జన్మదిన శు భాకాంక్షలు అంటూ రాఘవేంద్రరావు ట్వీట్ చేశారు.అదేవిధంగా దర్శకుడు గోపీచంద్ మలినేని, మంచు విష్ణు, సోనూసూద్, నిర్మాత నాగవంశీ వంటివారు తమ సోషల్ ప్లాట్ ఫాం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు పనితీరు, అంకితభావం, దూరదృష్టిని కొనియాడుతూ పోస్టులు చేశారు.

# రోజా నోటికి అడ్డూ అదుపూ లేదా? కంట్రోల్ చేయవా జగన్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్కే రోజా అనవసరంగా చేస్తున్న కామెంట్స్ వైసీపీని ఇబ్బంది పెట్టేలా కనిపిస్తున్నాయి. తాను ఏమనుకుంటుందో ఏమో కానీ, రోజా మాత్రం చిన్నారులను సయితం వదిలిపెట్టకుండా విమర్శలు చేస్తుండటంతో సామాన్య ప్రజలతో పాటు పార్టీ అభిమానులు కూడా హర్ట్ అవుతున్నారు. అంతే కాదు.. రోజా ఏ ఉద్దేశ్యంతో అన్నా అది సోషల్ మీడియాలో వైసీపీకి బూమ్ రాంగ్ గా మారుతుంది. ఎందుకో తెలియదు కానీ ఆర్కే రోజా సినిమాల్లో, జబర్దస్త్ షోలో మాట్లాడిన తీరులా రాజకీయాల్లో మాట్లాడి పార్టీని ఇబ్బందుల్లో పడేస్తున్నారని సొంత పార్టీ నేతలే అంటున్నారు. ఇప్పుడిప్పుడే కూటమి ప్రభుత్వంపై హామీలు అమలు చేయలేదన్న అసంతృప్తి పెల్లుబుకుతున్న సమయంలో రోజా కామెంట్స్ తో ప్రభుత్వానికి అనుకూలంగా మారుతుంది.

**ఎవరికి అనుకూలం?**

అసలు రోజా వైసీపీకి అనుకూలంగా ఉన్నారా? లేక కూటమి ప్రభుత్వానికి తిరిగి కోలుకునేలా ఆమె సహకరిస్తున్నారా? అన్న అనుమానాలు కూడా సొంత పార్టీ నేతల్లోనే బయలుదేరాయి. ఎవరైనా రాజకీయ విమర్శలు చేయవచ్చు. హామీలు అమలు చేయకపోవడంపై ప్రశ్నించవచ్చు. తప్పుడు కేసులపై నిలదీయవచ్చు. అంతే తప్ప కుటుంబ సభ్యులను రాజకీయ వివాదంలోకి లాగితే ప్రజలు సెంటిమెంట్ ఫీలవుతారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిపై చేసిన వ్యాఖ్యలు వైసీపీ 2024 ఓటమికి కారణాలయ్యాయని రోజాకు తెలియదా? అని నేతలే ప్రశ్నిస్తున్నారు. వైసీపీకి వచ్చే సెంటిమెంట్ ను కూడా, సానుభూతిని కూడా రోజా తన వ్యాఖ్యలతో పోగొడుతున్నారని అంటున్నారు.

**చిన్న పిల్లాడిపై...**

తాజాగా భూమన కరుణాకరరెడ్డిని తిరుపతిలో గోశాల వివాదంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినప్పుడు ఆర్కే రోజా అక్కడ ప్రత్యక్షమయ్యారు. తన జిల్లా కావడంతో అక్కడకు వచ్చినా మరోసారి పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేశారు. పవన్ కుమారుడికి ఇటీవల సింగపూర్ లో జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ తిరుమల వెంకటేశ్వర స్వామితో పెట్టుకోవడం వల్లనే అలా జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలు రోజా నోటికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నది అర్థమయింది. చిన్న పిల్లవాడు ప్రమాదం నుంచి బయటపడితే హర్షించాల్సింది పోయి ఆ ఘటనను కూడా రాజకీయ వివాదంలోకి లాగటమేంటన్న ప్రశ్నలు వినపడుతున్నాయి. ఇలాగే రోజా మాట్లాడితే పార్టీకి మొన్న వచ్చిన స్థానాలు కూడా వచ్చే అవకాశం లేదంటున్నారు.

**రోజా కామెంట్స్ తో ...**

రోజా కామెంట్స్ తో జనసేన క్యాడర్ రగలిపోతుంది. పవన్ కల్యాణ్ అభిమానులు కూడా రోజా పై ఫైర్ అవుతున్నారు. దీనిపై పవన్ కల్యాణ్ తో పాటు మెగా కుటుంబ సభ్యులు మౌనంగా ఉన్నప్పటికీ అదే రోజా పెద్ద శిక్ష అని అంటున్నారు. మరోవైపు జనసైనికులు మాత్రం రోజాను సోషల్ మీడియాలో ఒక ఆటాడేసుకుంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రోజాకు కొత్తేమీ కాకపోయినా పవన్ కల్యాణ్ పై వ్యక్తిగతంగా విమర్శలు చేసినా పెద్దగా పట్టించుకోరు కానీ చిన్న పిల్లవాడిని బయటకు లాక్కొచ్చి చేసిన వ్యాఖ్యలు మాత్రం రోజా నాలుక ఎటు అంటే అటు వైపు తిరుగుతుందన్న కామెంట్స్ జోరుగా వినపడుతున్నాయి. అధికారంలో కోల్పోయినా ఇంకా పార్టీకి డ్యామేజీ చేస్తున్న రోజా లాంటి నేతలను జగన్ కట్టడి చేయాల్సి ఉంది.

## వయసు 120... అయినవాళ్లు ప్రమాదంలో పోయారు...

# ఇప్పటికీ బతుకుబండి లాగిస్తున్నాడు!



**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా వృద్ధాప్యం మీద పడగానే చాలామంది పనుల నుంచి విరమించుకుని విశ్రాంతి తీసుకుంటారు. కానీ, తమిళనాడుకు చెందిన ఓ వృద్ధుడు మాత్రం 120 ఏళ్ల వయసులోనూ తన కాళ్లపై తాను నిలబడుతూ, కష్టపడి పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత 50 ఏళ్లుగా రుచికరమైన లడ్డూలు తయారు చేసి విక్రయిస్తూ ఆయన తన జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ వయసులోనూ ఆయన చూపిస్తున్న పట్టుదల, జీవన శైలి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. వివరాల్లోకి వెళితే, మహ్మద్ అబు సలీమ్ అనే ఈ పెద్దాయన వయసు 120 సంవత్సరాలు. ఆయన స్వస్థలం బర్మా అయినప్పటికీ, చాలా సంవత్సరాల క్రితమే తమిళనాడుకు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. అయితే, గతంలో జరిగిన ఓ దురదృష్టకర ప్రమాదంలో ఆయన తన కుటుంబ సభ్యులందరినీ కోల్పోయారు. ఈ విషాదం నుంచి తేరుకున్న సలీమ్, తన జీవనోపాధి కోసం తీపి తినుబండారాలు తయారు చేసి అమ్మాలని నిర్ణయించుకున్నారు. గత సుమారు 50 సంవత్సరాలుగా ఆయన అల్లం, కొబ్బరి, గ్లూకోజ్ మిశ్రమంతో ప్రత్యేకమైన లడ్డూలను తయారు చేస్తున్నారు. కడలూరు, విల్లుపురం, తిండివనం, మాయావరం, కుంభకోణం వంటి అనేక ప్రాంతాల్లో ఆయన లడ్డూలకు మంచి పేరుంది. గతంలో ఆయనే స్వయంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి లడ్డూలు విక్రయించేవారు. అయితే, వయసు పైబడటంతో ప్రస్తుతం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో తన ఇంటి వద్దనే లడ్డూలు తయారు చేసి విక్రయిస్తున్నారు. స్థానికులు, ఆయన లడ్డూల గురించి తెలిసినవారు ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తాను రోజూ రెండు మూడు లడ్డూలు తింటానని, అయినా తనకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని సలీమ్ చెబుతున్నారు. ఇటీవల మహ్మద్ షేక్ అనే వ్యక్తి సలీమ్‌ను ఇంటర్వ్యూ చేసి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ విషయం విస్తృతంగా వెలుగులోకి వచ్చింది. 120 ఏళ్ల వయసులోనూ సలీమ్ కష్టపడి పనిచేస్తుండటంపై నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆయన పట్టుదల, స్ఫూర్తిదాయకమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## బాపట్లలో హోటళ్లు, లాడ్జిలలో పోలీసుల తనిఖీలు.. కారణం ఇదేనట!

- 32 పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న 75 హోటళ్లు, లాడ్జిలు, దాబాల్లో సోదాలు
- రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు పరిశీలన
- అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకున్నామని ఎస్పీ వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**బాపట్ల జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిని కట్టడి చేయడానికి జిల్లాలోని 32 పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న 75 హోటళ్లు, లాడ్జిలు, దాబాల్లో శనివారం విస్తృతంగా సోదాలు చేశామని చెప్పారు. రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు ఆకస్మికంగా జరిపిన ఈ సోదాలలో లాడ్జిలు, హోటళ్ల రికార్డులను పోలీసులు పరిశీలించారు. బస చేసేవారి గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, ఆ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.నేరాలకు పాల్పడే వారు, బెట్టింగ్ లు నిర్వహించే వారు, గంజాయి సేవించే వారు, ఇతర పలు అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు సహజంగా తాత్కాలిక ఆవాసం కోసం వీటిని ఎంచుకుంటారన్నారు. అటువంటి వాటికి చోటివ్వ వద్దనే ప్రధాన ఉద్దేశంతో ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. రెస్టారెంట్లు దాబాలలో ఇతర ప్రదేశాలలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లు ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వారు విధిగా పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ వివరించారు.

# సామాన్యుడి నుంచి అసమాన్యుడిగా ఎదిగి?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు 75వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్నారు. ఆయన వయసు 75 ఏళ్లయినా ఆయన రాజకీయ జీవితం ప్రారంభమై యాభై ఏళ్లు అవుతుంది. అంటే అతి చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి కాకలు తీరిన నేతగా ఎదిగాడు. ఏ మాత్రం గ్లామర్ లేని.. ఎలాంటి ఆకట్టుకునే ప్రసంగాలు చేయకపోయినా చంద్రబాబు కేవలం చేతల్లో మాత్రమే సూపర్ లీడర్ అయ్యారంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విభజన జరిగిన ఆంధ్రప్రదేశ్ కు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారంటే ఊరికే కాలేదు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. విమర్శలను పడ్డారు. అయినా పడి లేచిన కెరటంలా చంద్రబాబు రాజకీయ ప్రస్థానం కొనసాగుతూనే ఉంది.



**అంచెలంచెలుగా ఎదిగి...**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా మరో పదిహేనేళ్లు ఆంధ్రప్రదేశ్ ను ఏలినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. 1950లో చిత్తూరు జిల్లా నారావారపల్లె అనే కుగ్రామంలో జన్మించిన చంద్రబాబు అంచెలంచెలుగా ఎదిగారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని లాక్కున్నారన్న అపవాదును ఎదుర్కొన్నప్పటికీ ఆయన సమర్ధవంతంగా ప్రజల్లో దానికి మద్దతు పొందగలిగారు. ముఖ్యమంత్రి అయ్యారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తనకు తాను సీఈవోగా రాష్ట్రానికి ప్రకటించుకున్నారు. చిన్న వయసులో ముఖ్యమంత్రి కావడంతో పాటు గత ముఖ్యమంత్రులను చూసిన ప్రజలకు చంద్రబాబు పాలన కొత్తగా కనిపించింది. ఆకస్మిక తనిఖీలు, సంస్కరణలు.. ఇలా ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు.

**ఓటములు ఎదురయినప్పుడు...**

1999లో రెండో సారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు 2004లో ఓటమి పాలయ్యారు. 2009లోనూ ఆయన మరోసారి అపజయం వెంటాడింది. ఇక చంద్రబాబు పని అయిపోయినట్లేనని ప్రత్యర్థులు చేసే విమర్శలను ఏమాత్రం లెక్క చేయకుండా తన పని తాను చేసుకుపోయారు. మొక్కవోని ధైర్యంతో మొండిగానే తన పని తీను చేసుకు పోయారు. 2004, 2009లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలయినప్పుడు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎంతో మంది నేతలు హ్యాండిచ్చివెళ్లిపోయారు. అయినా ఏ మాత్రం వెరవలేదు. తిరిగి పార్టీని నిలబెడతానన్న నమ్మకం ఆయనలో అణువణువునా కనిపించేది. ఇక ఇంట్లో తక్కువ పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కువ సమయం గడిపేవారు. రాజకీయాలే శ్వాసగా ఆయన ముందుకు సాగారు.

**ఎన్నో విమర్శలు...**

2019లో ఒంటరిగా పోటీ చేసి ఓటమి పాలయినప్పుడు కూడా అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే తన రాజకీయ చాణక్యంతో ఆయన మళ్లీ కూటమిని ఏర్పాటు చేశారు. ప్రత్యర్థి బలహీనతలను సులువుగా కనిపెట్టి దానికి విరుగుడు కనిపెట్టి పొలిటికల్ గా దెబ్బతీయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అందకే ఎవరు హేళన చేసినా, ఎందరు కవ్వించినా ఆయన మౌనంగానే ఉంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఫలితంగా 2024 ఎన్నికల్లో కూటమిని ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్లి అఖండ మెజారిటీతో గెలుపొందారు. నాలుగో సారి ముఖ్యమంత్రి అయ్యారు. చంద్రబాబు విజన్ అంటూ కబుర్లు చెబుతారన్న విమర్శలకు ఆయన వేలు సైబరాబాద్ వైపు చూపుతుంది. ఐటీ రంగాన్ని, 2020 విజన్ ను నాడు హేళన చేసిన వారు నేడు నిజమయిందని నమ్ముతున్నారు. అందుకే చంద్రబాబు నూరు వసంతాలు నిండుగా జీవించాలని "తెలుగు పోస్ట్" కోరుకుంటుంది. హ్యాపీ బర్త్ డే నాయుడు గారూ.

# జాంబియాలో భారీగా నగదు, బంగారంతో భారతీయుడి అరెస్ట్


**హైదరాబాద్ పెన్ పవర్:** భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని అక్రమంగా దుబాయ్ తరలించేందుకు యత్నించిన ఒక భారతీయ పౌరుడిని అరెస్టు చేసినట్లు జాంబియా కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. కెన్నెత్ కౌండా అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడి నుంచి సుమారు రూ. 17 కోట్లకు పైగా విలువైన అమెరికన్ కరెన్సీ, సుమారు 5 లక్షల డాలర్ల విలువచేసే బంగారు కడ్డీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జాంబియా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దుబాయ్ వెళ్లేందుకు 27 ఏళ్ల భారతీయ పౌరుడు భారీ లగేజీతో కెన్నెత్ కౌండా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు వచ్చాడు. ఈ క్రమంలో విమానాశ్రయంలోని అధికారుల బృందం తనిఖీలు నిర్వహించగా, అతడి వద్ద భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ, బంగారం బయటపడిందని జాంబియా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషన్ (డీఈసీ) తెలిపింది. 23.2 లక్షల డాలర్ల (సుమారు రూ.17.07 కోట్లు) నగదు, 5 లక్షల డాలర్ల (సుమారు రూ.4.17 కోట్లు) విలువ చేసే ఏడు బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నట్లు డీఈసీ పేర్కొంది. నగదు మొత్తం 100 డాలర్ల నోట్ల రూపంలో ఉంది. ఈ నోట్ల కట్టలను రబ్బర్ బ్యాండ్లతో కట్టి, ఒక నల్ల బ్యాగులో ఉంచి, ఆ బ్యాగును మరో పెద్ద సూట్‌కేస్‌లో పెట్టి తరలించేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు




కొనసాగుతోందని డీఈసీ స్పష్టం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని డీఈసీ అధికారులు హెచ్చరించారు. దక్షిణాఫ్రికా దేశమైన జాంబియాలో రాగి, బంగారం వంటి ఖనిజ నిల్వలు సమృద్ధిగా ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం.. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారు. కాగా, గత ఏడాది కూడా జాంబియాలో ఆయుధాలు, 127 కిలోల బంగారం, 5.7 మిలియన్ డాలర్ల నగదుతో ప్రయాణిస్తున్న విమానంతో సహా ఐదుగురు ఈజిప్షియన్లను అరెస్టు చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే, వారిపై మోపిన గూఢచర్యం ఆరోపణలను ప్రాసిక్యూటర్లు ఉపసంహరించుకోవడంతో వారు విడుదలయ్యారు. తాజా ఘటనతో విమానాశ్రయంలో నిఘా మరింత కట్టుదిట్టం చేశారు.

# వేళ్లు చూపిస్తే లైట్లు వెలుగుతాయ్ - ఏయూ విద్యార్థినుల వినూత్న ఆవిష్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంట్లో లైట్లు, ఫ్యాన్‌లు, ఏసీలు ఆన్ చేయాలన్నా, ఆఫ్ చేయాలన్నా లేచి వెళ్లి స్విచ్ నొక్కాలి. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య కారణంగా మంచంపైనే ఉండేవారికి ఇది కాస్త కష్టమే.



ఇలాంటి వారందరికీ ఉపయోగపడే విధంగా కూర్చున్న చోట నుంచే వేలు చూపిస్తే పని జరిగిపోతే ఎలా ఉంటుంది? అనే ఉద్దేశంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు ఎం.ప్రదీప్తి, బి.కృపారాణి, బి.చందన లాశ్రీ, ఎ.నవ్య ఇదే ఆలోచన చేశారు.

**వేలు చూపిస్తే లైట్లు వెలుగుతాయ్:** వారికి ఆ ఆలోచన వచ్చిన వెంటనే ఇప్పటి వరకు మార్కెట్‌లో ఉన్న పలు పరికరాలను పరిశీలించారు. వాయిస్, సౌండ్ ద్వారా అవి పని చేస్తున్నాయని తెలుసుకున్నారు. అంతే కాకుండా వాటి ఖరీదు సైతం ఎక్కువగా ఉందని గుర్తించారు. దీనికి ప్రధాన కారణం వాటిల్లో ఉపయోగించిన సెన్సర్‌లు. ఒక్కో సెన్సర్ ఖరీదు 7 వేల రూపాయల వరకు ఉంటుంది. వాటన్నింటికీ పూర్తి భిన్నంగా సెన్సర్లు అవసరం లేకుండా కేవలం చేతి వేళ్లు చూపిస్తే పని చేసేలా 45 రోజులపాటు పరిశోధన చేసి ఇంటెల్లీ గెశ్చర్స్ అనే పరికరాన్ని రూపొందించారు. %కేవలం 1000 రూపాయలతోనే వినూత్న ఆవిష్కరణ: ఇంటెల్లీ గెశ్చర్స్ పరికరంలో ఆర్డునో యునో అనే మైక్రో కంట్రోలర్‌ను ఏయూ విద్యార్థులు అమర్చారు. పైథాన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి కంప్యూటర్ కెమెరా ముందు చేతి వేళ్లు ఉంచడం ద్వారా ఇంట్లో ఉండే ఉపకరణాలు పని చేసేలా ఈ పరికరాన్ని డిజైన్ చేశారు. త్వరలో దీనికోసం యాప్ రూపొందించనున్నట్లు తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే ఇంటెల్లీ గెశ్చర్స్ పరికరం అమర్చుకోవడం ద్వారా మొబైల్ ఫోన్‌కి చేతి వేళు చూపించి ఇంట్లో ఉండే ఉపకరణాలను నియంత్రించవచ్చని విద్యార్థినులు అంటున్నారు. దీని తయారీకి కేవలం 1000 రూపాయలు మాత్రమే ఖర్చు అయినట్లు విద్యార్థినులు వివరించారు. పనితీరు మెరుగుపరిచేలా ఇంకా ప్రయోగాలు చేస్తున్నామని చెప్పారు. అధ్యాపకురాలు డాక్టర్ ఎస్తర్ సునంద ఈ ప్రాజెక్టుకు గైడెన్స్ ఇచ్చారని అన్నారు. విద్యార్థినుల ప్రతిభను విభాగాధిపతి ఆచార్య ప్రజ్ఞ అభినందించారు.

# మహారాష్ట్రలో కీలక పరిణామాలు..రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కటవుతామని సంకేతాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్రలో ఏండ్ల నుంచి దూరం దూరంగా ఉన్న ఠాక్రేలను ఇప్పుడు భాషా వివాదం ఒకటి చేయనుందా?! ఇద్దరు ఠాక్రేల మాటలు వింటుంటే ఔననే సమాధానం వస్తున్నది. తమకు మహారాష్ట్ర సంస్కృతి, భాష, సంప్రదాయాలు ముఖ్యమని.. వాటి కోసం కలిసి పనిచేసేందుకు సిద్ధమని ఇటు మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్?ఎస్?) చీఫ్? రాజ్? ఠాక్రేతోపాటు అటు శివసేన(యూబీటీ) చీఫ్? ఉద్ధవ్? ఠాక్రే వేర్వేరు కార్యక్రమాల్లో ప్రకటించారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి దూరం దూరంగా ఉంటున్న ఈ అన్నదమ్ముల పిల్లలు ఇప్పుడు మళ్లీ మహారాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కటయ్యేందుకు రెడీ అనే సంకేతాలు ఇచ్చారు. వచ్చే అకడమిక్? ఇయర్? నుంచి మహారాష్ట్రలో జాతీయ విద్యావిధానం%-%2020తోపాటు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మరాఠీ, ఇంగ్లిష్? మీడియంలో థర్డ్? ల్యాంగ్వేజ్?గా హిందీని తప్పనిసరి చేయనున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై శివసేన (యూబీటీ) తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నది. హిందీని తప్పనిసరి చేయడం వల్ల మరాఠీ సంస్కృతికి విఘాతం కలుగుతుందని అంటున్నది.



**ఎవరేమన్నారంటే..?**

మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాల ముందు ఉద్ధవ్?కు, తనకు మధ్య ఉన్న విభేదాలు చాలా చిన్నవని పాడ్? క్యాస్ట్?లో రాజ్? ఠాక్రే పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా మరాఠా సంస్కృతికి తాము కలిసి పనిచేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. 2005లో శివసేన నుంచి విడిపడి తాను మహారాష్ట్ర నవనిర్మాణ సేన స్థాపించినప్పుడు ఉన్న పరిస్థితులను ఆయన పంచుకున్నారు. తాను బాల్? ఠాక్రే తప్ప ఎవరి కిందా పనిచేయలేనని, ఒంటరిగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకొని ఎంఎన్?ఎస్?ను ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. మహారాష్ట్ర ప్రజలకు, మరాఠా సంస్కృతికి విఘాతం కలుగుతున్నప్పుడు పోరాడేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని.. ఇప్పుడు ఈ విషయంలో ఉద్ధవ్?తో కలిసి నడిచేందుకు అభ్యంతరంలేదని రాజ్? ఠాక్రే స్పష్టం చేశారు.

తన ప్రజల కోసం చిన్నపాటి పంచాయితీలను పక్కనపెట్టడానికి తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానని భారతీయ కామగార్? సేన సమావేశంలో శివసేన (యూబీటీ) చీఫ్?, మాజీ సీఎం ఉద్ధవ్? ఠాక్రే అన్నారు. "మహారాష్ట్రకు కష్టకాలం వచ్చినప్పుడు ఇక్కడి వారంతా కలిసి కట్టుగా ఎదుర్కోవాల్సిందే. ఆ పోరాటంలో మేం ముందుంటాం. ఇండస్ట్రీలను గుజరాత్?కు తరలించుకుపోతున్నారని నేను ప్రశ్నించినప్పుడే అందరం ఒక్కటైతే సమస్య ఉండేది కాదు. మహారాష్ట్ర కోసం పనిచేసే ప్రభుత్వాన్నే ఏర్పాటు చేసేవాళ్లం. ఇప్పటికైనా మించిపోయింది లేదు" అని వ్యాఖ్యానించారు.

# జీతాల శకం ముగిసింది.. ఉద్యోగాలపై మిడిల్ క్లాస్ ఆశలు వదులుకోవాల్సిందే.. ప్రముఖ ఇన్వెస్టర్ సౌరభ్ ముఖర్జియా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ మధ్య జాబ్ మేళాలు చూసుంటారు. పోస్టులు ఎన్ని ఉన్నాయని కాదు.. వేల సంఖ్యలో.. అవసరం అనుకుంటే లక్షల్లో నిరుద్యోగులు హాజరవుతున్న పరిస్థితి.. ఇది కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశ వ్యాప్తంగా.. ఇదే పరిస్థితి. ఎక్కడ జాబ్ మేళా ఉన్నా.. ఏ కంపెనీ ఇంటర్వ్యూకు పిలిచినా నిరుద్యోగులు క్యూ కడుతున్నారు. ఈ సిచువేషన్ చూస్తేనే అర్థం అవుతుంది.. అన్‌ఎంప్లాయిమెంట్ రేటు ఎలా పెరిగింది అనేది. వంద మంది పాస్ అవుట్ అవుతుంటే 3 నుంచి 5 మందికే జాబ్స్ దొరుకుతున్నాయని పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రస్తుతం జాబ్స్ కోసం ఎగబడే పరిస్థితులు ఉన్నాయి. కానీ ప్రముఖ ఇన్వెస్టర్, మెర్సిలస్ ఇన్వెస్ట్?మెంట్ మేనేజర్స్ ఫౌండర్, సౌరభ్ ముఖర్జియా ఉద్యోగాలపై బాంబ్ పేల్చారు. ఆయన మాటలు మిడిల్ క్లాస్ ఊహలన్నీ పేకమేడల్లా కూలిపోయినట్లు.. ఫ్యూచర్ ఒక్కసారిగా కళ్లముందు కనిపించడం ఖాయం. అదేంటో తెలుసుకుందాం. రీసెంట్ గా ఒక పాడ్?కాస్ట్ లో మాట్లాడుతూ మిడిల్ క్లాస్ ప్రజలు ఎంత డేంజర్ లో ఉన్నారో చెప్పారు సౌరభ్ ముఖర్జియా. "జీతాల శకం ముగిసింది ( ఇండియన్ మిడిల్ క్లాస్ తొందరగా మారకపోతే అంతే సంగతులు" అని బాంబ్ పేల్చారు. ఇండియా న్యూ ఎకనమిక్ ఫేజ్ (నూతన ఆర్థిక దశ) లోకి ఎంటర్ అవుతోంది. సంప్రదాయ ఉద్యోగాలు, వైట్ కాలర్ జాబ్స్, జీతంపై ఆధారపడి చేసే జాబ్



లపై ఎంత మాత్రం చదువుకున్న వాళ్లు ఆధారపడే పరిస్థితి లేదు" అని అన్నారు.

ఈ దశాబ్దంలో జాబ్స్ క్రమక్రమంగా తగ్గుతాయని సౌరభ్ అన్నారు. ఏఐ (Artificial Intelligence) ఆధారిత ఆటోమేషన్, వివిధ పరిశ్రమలలో మెషిన్లను మనుషులు నడిపే వ్యవస్థ పడిపోతుండటమే అందుకు కారణం అని అభిప్రాయపడ్డారు. "తమ కంపెనీ కోడింగ్ లో మూడవ వంతు ఏఐ రాసేస్తోందని గూగుల్ ప్రకటించింది. అదే పరిస్థితి ఇండియన్ ఐటీ, మీడియా, ఫైనాన్స్ కంపెనీల్లో ఉంటుంది. చివరికి సూపర్ వైజర్ పోస్టులు కూడా ఏఐ కారణంగా కనుమరుగు అవుతాయి" అని ఆయన తెలిపారు. మన తండ్రులు, తాతలు చేసినట్లుగా 30 ఏళ్లుగా ఒకే కంపెనీలో జాబ్ చేశానని చెప్పుకునే పరిస్థితులు భవిష్యత్తులో ఉండవని.. మిడల్ క్లాస్ దశాబ్దాలుగా ఆధారపడిన జాబ్ వ్యవస్థ కుప్పకూలుతుందని సౌరభ్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే మిడిల్ క్లాస్ కు ఉన్న ఏకైక మార్గం.. ఆంత్రప్రెన్యూవర్?షిప్ కు షిఫ్ట్ కావడమేనని అన్నారు. జన్ ధన్, ఆధార్, మొబైల్ అనే త్రయం ద్వారా అవకాశాలను వెతవకొచ్చునని చెప్పారు. వీటిద్వారా ఐడెంటిటీ, బ్యాంకింగ్, ఇన్ఫర్మేషన్.. ఈ మూడింటి ఆధారంగా ఆంత్రప్రెన్యూవర్?షిప్ వైపు తరలేందుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ఇండియా జీతాలపై ఆధారపడి, జీతాల ఆధారంగా వ్యక్తుల కేపబులిటీని లెక్కగట్టే సొసైటీ అని. .కానీ ఇకనుంచి ఆ దృక్పథం నుంచి మనల్ని మనం మార్చుకవాలని అన్నారు. నెలవారీగా వచ్చే ఆదాయం కాకుండా.. హ్యాపీనెస్, మనం చేస్తున్న పని ప్రభావం అనే అశం ఆధారంగా ముందుకెళ్లాల్సి ఉంటుందని సూచించారు. పిల్లలను జాబ్స్ కోసం తయారు చేసే కుటుంబాలు మారాలనీ.. ఫ్యూచర్ లో జాబ్స్ అంటూ ఉండవనీ ఈ సందర్భంగా చెప్పారు.

## ఏటీఎం విధానంలో సాగు - 3 గుంటల భూమిలో 17 రకాల పంటలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రసాయన ఎరువులతో పంటలు సాగు చేయడం వల్ల ఖర్చు విపరీతంగా పెరిగి ఆర్థికంగా చితికిపోతున్న ఎంతో మంది రైతులను చూస్తూనే ఉన్నాం. దీనికి కాస్త భిన్నంగా పాత పద్ధతులను అనుసరిస్తూనే ఏటీఎం సాగుకు శ్రీకారం చుట్టారు ఓ రైతు. తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ రకాల పంటలను సాగు చేస్తూ, నిరంతర ఆదాయార్జన చేస్తున్నారు. మరి ఆ రైతు ఎవరు? ఎలా పండిస్తున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.ఏటీఎం విధానంలో సాగు: తిరుపతి గ్రామీణ మండలం అడపారెడ్డిపల్లికి చెందిన మిథున్‌రెడ్డి బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ చేశారు. ఏటీఎం విధానంలో తనకున్న 3 గుంటల భూమిలోనే సేంద్రియ పద్ధతిలో దాదాపు 19 రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఆవుపేడ, పంచితం, బెల్లం, పుట్టమట్టితో తయారు చేసిన జీవామృతంతో పంటలకు ఎటువంటి చీడపీడలు రాకుండా పూర్తిగా అరికడుతున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసిన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను ప్రతి సోమవారం కలెక్టరేట్ దగ్గర నిర్వహించే స్టాల్‌లో విక్రయిస్తున్నారు. దీని ద్వారా 365 రోజులూ ఏదో ఒక పంట అందుబాటులో ఉంటుంది. దీంతో ఖర్చులకు డబ్బులు ఎప్పుడు కావాలన్నా సరే పొలంలో కాయగూరలు, పండ్లను కోసుకొచ్చి విక్రయించొచ్చచంటూ మిథున్‌రెడ్డి తన అనుభవాలను పంచుకున్నారు. ప్రతి నెలా రూ.6-8 వేల ఆదాయం: అదే విధంగా చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం కైగల్‌కు చెందిన మహిళా రైతు ప్రమీలమ్మ 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం విధానంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రతి నెలా దాదాపు 6 నుంచి 8 వేల రూపాయల ఆదాయం చేతికొస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి సాగుతో పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గుతున్నాయని ఈ రైతులు చెబుతున్నారు. ఇంటి అవసరాలకు పోనూ పండించిన కూరగాయలన్నింటినీ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఓ పంట తర్వాత మరో పంట చేతికి వస్తుండటంతో కుటుంబ అవసరాలకు ఏ విధమైన ఆటంకం ఉండటం లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## అంతర్జాతీయ అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్‌పై నాడా సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ అంతర్జాతీయ అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్‌పై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(%చీూణూ%) సస్పెన్షన్ వేటు వేసింది. రమేష్ దగ్గర కోచింగ్ తీసుకున్న ఇద్దరు క్రీడాకారులు డోప్ టెస్ట్ కు నిరాకరించారు. డోప్ టెస్ట్ కు షాంపిల్స్ ఇవ్వకుండా దాటవేశారు. దీంతో వారికి కోచ్ గా ఉన్న నాగపురి రమేష్ పై వేటు పడింది. రమేష్ కు ద్రోణాచార్య అవార్డు పొందారు.నాగపురి రమేష్ కోచ్ గా అంతర్జాతీయ ప్లేయర్స్ దుతి చంద్, పారా ఒలంపియాన్ జీవంజీ దీప్తి, నందిని వంటి దిగ్గజ క్రీడాకారులను తీర్చిదిద్దారు. డోపింగ్ వ్యవహారంలో నాగపురి రమేష్ తో పాటు మరో ఇద్దరు అసిస్టెంట్ కోచ్ లపైనా సస్పెన్షన్ వేటు పడింది. మరోవైపు క్రీడాకారులు పరాస్ సింఘాల్, పూజారాణి, నలుబోతు షణ్ముగ శ్రీనివాసులు, చెలిమి ప్రతుష, శుభం మహారా, కిరణ్ ,జ్యోతితో సహా ఏడుగురు అథ్లెట్లు డోపింగ్ పరీక్షలను తప్పించుకున్నారనే ఆరోపణలతో సస్పెన్షన్ ఎదుర్కొంటున్నారు. కోచ్ నాగ్‌పురి అథ్లెట్లు పరీక్షలను తప్పించుకోవడానికి సహాయం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. రమేష్ నాగ్‌పురి హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో పనిచేస్తున్నాడు. 2023లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగ్‌పురిని జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య జూనియర్ చీఫ్ కోచ్‌గా నియమించింది. యాంటీ-డోపింగ్ రూల్స్, 2021లోని ఆర్టికల్ 2.9 ప్రకారం అతనిపై సస్పెన్షన్ విధించబడింది.

## చనిపోయిన తర్వాత కూడా నాకు న్యాయం జరగకపోతే... నా అస్థికలు డ్రైనేజిలో కలపండి




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్య, ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఎదురవుతున్న మానసిక వేధింపులు భరించలేకపోతున్నానంటూ 33 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (టెక్కీ) మోహిత్ యాదవ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. బలవన్మరణానికి ముందు ఆయన రికార్డ్ చేసిన వీడియో సందేశం తీవ్ర కలకలం రేపుతోంది. పురుషులకు చట్టపరమైన రక్షణ లేకపోవడం వల్లే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకుంటున్నట్లు మోహిత్ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు."ఈ వీడియో మీకు చేరే సమయానికి నేను ఈ లోకంలో ఉండను. బహుశా పురుషుల కోసం కూడా ఓ చట్టం ఉండి ఉంటే నేను ఈ అఘాయిత్యానికి పాల్పడేవాడిని కాదేమో. నా భార్య, ఆమె కుటుంబ సభ్యులు పెడుతున్న మానసిక క్షోభను నేను భరించలేకపోతున్నాను. అమ్మానాన్న నన్ను క్షమించండి" అని మోహిత్ కన్నీటితో వీడియోలో పేర్కొన్నారు. "నా మరణం తర్వాత కూడా నాకు న్యాయం జరగకపోతే, నా అస్థికలను ఏదైనా మురుగు కాలువలో కలపండి" అని ఆయన ఆవేదనగా చెప్పడం తీవ్రంగా కలిచివేస్తోంది.తన భార్య ప్రియా యాదవ్ తన పేరిట ఉన్న ఇల్లు, ఆస్తిని ఆమె పేరు మీద రిజిస్టర్ చేయాలని బెదిరిస్తోందని మోహిత్ ఆరోపించారు. అలా చేయకపోతే తన కుటుంబాన్ని వరకట్న వేధింపుల కేసులో ఇరికిస్తానని హెచ్చరించిందని తెలిపారు. తన మామ మనోజ్ యాదవ్ తప్పుడు ఫిర్యాదు చేశారని, బావమరిది చంపేస్తానని బెదిరించాడని వాపోయారు. అంతేకాకుండా, తన భార్య గర్భం దాల్చితే అత్తగారు బలవంతంగా అబార్షన్ చేయించారని మోహిత్ ఆరోపించడం గమనార్హం.సరిగ్గా రెండు రోజుల క్రితమే ఉత్తరప్రదేశ్‌లోనే ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. నిరంతరం వేధింపులు, ఆర్థిక డిమాండ్లతో తన భర్త, 34 ఏళ్ల మీడియా నిపుణుడు మోహిత్ త్యాగి ఆత్మహత్యకు కారణమైందన్న ఆరోపణలపై సంభాల్ ప్రాంతానికి చెందిన ప్రియాంక అనే 30 ఏళ్ల మహిళపై కేసు నమోదైంది. డిసెంబర్ 2020లో పెళ్లైన కొన్నాళ్లకే కష్టాలు మొదలయ్యాయని, పెళ్లి కానుకగా వచ్చిన నగలతో ఆమె వెళ్లిపోయిందని, మోహిత్ త్యాగి, అతని కుటుంబంపై తప్పుడు ఫిర్యాదులు చేసిందని మృతుడి సోదరుడు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

గతేడాది డిసెంబర్‌లో బెంగళూరుకు చెందిన 34 ఏళ్ల టెక్కీ అతుల్ సుభాష్ కూడా తన అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. చనిపోయే ముందు ఆయన 24 పేజీల లేఖ, ఒక వీడియో సందేశాన్ని వదిలివెళ్లారు. అందులో తన భార్య, అత్తమామలు తీవ్రంగా వేధిస్తున్నారని, తనపై 8 తప్పుడు పోలీస్ కేసులు పెట్టారని ఆరోపించారు. విడాకులకు రూ.3 కోట్లు, తన కుమారుడిని చూసేందుకు అదనంగా రూ.30 లక్షలు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. అతుల్ తమ్ముడు బికాస్ మోదీ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాజా మోహిత్ యాదవ్ ఘటన ఈ కేసులను గుర్తుకు తెస్తోంది.

## టన్నెల్ లో లేటెస్ట్ అప్ డేట్ మీకు తెలుసుకోవాలనుందా?




**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదంలో సహాయక చర్యలకు ముగింపు కనిపించడం లేదు. రెస్క్యూ ఆపరేషన్ మొదలయి 58వ రోజుకు చేరుకుంది. టన్నెల్ లో సహాయక చర్యలు ఎప్పటి వరకూ జరుగుతాయన్నది ఎవరికి అంతుచిక్కడం లేదు. ఆరు మృతదేహాలు లభ్యమయితే తప్ప ఆపరేషన్ ముగియదు. అప్పటి వరకూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించాల్సిందేనని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో కొన్ని రోజులుగా చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే అనేక ఆటంకాలు సహాయక చర్యలకు ఇబ్బందిగా మారుతున్నాయి.

### ప్రమాదకరమైన ప్రాంతంలో...

టన్నెల్ లో ప్రమాదకరమైన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగించాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు పై కప్పు నుంచి ఉబికి వస్తున్న నీటితో పాటు మరొకవైపు బురద పేరుకుపోయి దానిని తొలగించాల్సి రావడం, పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా ఉండటం. టీబీఎం మిషన్ శకలాలను కూడా బయటకు తరలించాల్సి రావడంతో మృతదేహాల వెలికి తీసే పనిని పక్కన పెట్టి ఈ పనులపైనే సహాయక బృందాలు ఎక్కువగా ఫోకస్ చేయాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. అందుకే ఇంత ఆలస్యమవుతుందని చెబుతున్నారు.

### టన్నెల్ పనులను...

మరోవైపు శ్రీశైలం టన్నెల్ లో పనులను తిరిగి ప్రారంభించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేస్తుంది ఇందుకోసం ఇన్ లెట్ వైపు నుంచి పనులు నిలిచిపోవడడంతో అవుట్ లెట్ వైపు నుంచి తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి టీజీఎం బేరింగ్ మిషన్ ను తెప్పించింది. టీవెం మిషన్ మరమ్మతులకు గురి కావడంతో రెండేళ్లుగా పనులు నిలిచిపోవడంతో వీలయినంత త్వరగా అవుట్ లెట్ వైపు నుంచిపనులను ప్రారంభించాలని భావిస్తుంది. అమెరికాకు చెందిన కంపెనీ ఈ బేరింగ్ ను తయారు చేసి నౌకలో తరలించగా చెన్నై నుంచి భారీ వాహనంలో టన్నెల్ వద్దకు చేరుకుంది. రెండు నెలల పాటు దీనిని బిగించేందుకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. జులైలో పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. ఒకవైపు సహాయక చర్యలు మరోవైపు టన్నెల్ లో మళ్లీ పనులను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## తిరుమలలో కంపార్ట్ మెంట్లన్నీ నిండిపోయి... క్యూ లైన్ ఎంత పొడవు ఉందంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. వేసవికి ముందే తిరుమలలో భక్తుల తాకిడి పెరిగింది. బయట వరకూ క్యూ లైన్లు నిండిపోతున్నాయి. తిరుమలలో ఎక్కడ చూసినా భక్తులు దర్శనమిస్తున్నారు. ఎక్కడ చూసినా గోవింద నామస్మరణలతో తిరుమల వీధులన్నీ మారుమోగుమోగుతున్నాయి. ఇదే సమయంలో తిరుమలలో ఎండల తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

### వేసవిలో రద్దీ...

ఇప్పటికే జులై నెల దర్శనం టిక్కెట్లు కూడా ఆన్ లైన్ లో విడుదల అవుతుండటంతో అవి కూడా హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. భక్తులు ఎక్కువగా మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఎక్కడికక్కడ తిరుమలలో జలప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. చల్లని మంచి నీటిని అందిస్తున్నారు. అలాగే క్యూ లైన్ లో ఉన్న వారికి మజ్జిగ, మంచినీళ్లు, అన్న ప్రసాదాలను కూడా శ్రీవారి సేవకులు సరఫరా చేస్తున్నారు. జూన్ నెలాఖరు వరకూ రద్దీ ఇలాగే ఉంటుందని అంచనా వేసిన తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు




ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### హుండీ ఆదాయం...

ఈరోజు తిరుమలలోని అన్ని కంపార్ట్ మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు కంపార్ట్ మెంట్లు నిండిపోయి బయట కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకూ క్యూ లైన్ విస్తరించి ఉంది. ఉచిత దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం ఏడున్నర గంటలకు టోకెన్లు లేకుండా ప్రవేశించి వేచి ఉన్న భక్తులకు శ్రీవారి దర్శనం పద్దెనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు ఐదు గంటలకు పైగానే సమయం పడుతుంది. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేసిన భక్తులకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 78,821 మంది భక్తులు దర్శించుకున్నారు. నిన్న 33,568 మంది భక్తులు తలనీలాలను సమర్పించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 3.36 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు.